

పూలమాల వేసి బీఆర్ఎస్ అభ్యర్థి లింగాలకు స్వాగతం పలుకుతున్న మహిళ

# నియోజకవర్గంలో అభివృద్ధి పనులన్నీ.. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసినవే..

- ఇక్కడి ఎమ్మెల్యే నిధులు తేలేదు.. ఏ గ్రామానికీ రాలేదు..
- అభివృద్ధి పనుల్లోని ఇటుక బిళ్ల కూడా కేసీఆర్ పంపినదే..
- మధిర మండల పర్యటనలో బీఆర్ఎస్ అభ్యర్థి కమల్‌రాజు

మధిర రూరల్, నవంబర్ 22: నియోజకవర్గంలోని అభివృద్ధి పనులన్నీ బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టినవేనని జడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ అభ్యర్థి లింగాల కమల్‌రాజు పేర్కొన్నారు. ఇందుకోసం ఇక్కడి ఎమ్మెల్యే భట్టి విక్రమార్క నిధులేమీ తేలేదని, అసలు ఏ గ్రామంలోనూ పర్యటించలేదని విమర్శించారు. ఇక్కడ జరిగిన అభివృద్ధి పనుల్లోని ప్రతి ఇటుక బిళ్ల కూడా సీఎం కేసీఆర్ పంపినదేనని స్పష్టం చేశారు. అందుకని ఆయన ఆశీర్వాదంతో వచ్చిన తనను ఇక్కడి ప్రజలు ఈ ఎన్నికల్లో ఆదరించాలని కోరారు. కారు గుర్తుకు ఓటు వేసి తనకు అత్యధిక మెజార్టీ అందించాలని విజ్ఞప్తి చేశారు. తాను కూడా ప్రజల నియోజకవర్గ ప్రజల మధ్యనే ఉంటున్నానని, వారి కష్టసుఖాల్లో పాల్పంచుకుంటున్నానని అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం పర్యటించిన ఆయన.. ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని గమనించి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. గ్రామాల్లో జరిగిన ఏ చిన్న పని అయినా తెలంగాణ ప్రభుత్వం చేసినదేనని అన్నారు. గ్రామాల్లో చిన్న చిన్న రోడ్లు మిగిలిపోయి ఉంటే త్వరలోనే వాటిని పూర్తి చేస్తామని అన్నారు. కల్యాణలక్ష్మి, రైతుబంధు వంటి పథకాల లబ్ధిదారులందరూ బీఆర్ఎస్ ప్రభుత్వం వైపే ఉన్నారని అన్నారు. ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు నంద్రు సుశీల, కోటా రామారావు, బంగారమ్మ, బొగ్గుల పద్మావతి, గుర్రం రామారావు, రంగిశెట్టి కోటేశ్వరరావు, రావూరి శ్రీనివాసరావు, చిత్తారు నాగేశ్వరరావు, చావా వేణు, కటికల వెంకటసత్యనారాయణరెడ్డి, రావూరి రామారావు తదితరులు పాల్గొన్నారు.

# 'వైరా'ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా..

- మారుమూల గ్రామాలకూ మౌలిక సదుపాయాలు కల్పిస్తాం
- నూతన మ్యానిఫెస్టోను ప్రకారం నిధులు మంజూరు చేస్తాం
- జూలూరుపాడు ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థి మదన్‌లాల్

జూలూరుపాడు, నవంబర్ 22: సీఎం కేసీఆర్ ఆశీస్సులతో పోటీ చేస్తున్న తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని బీఆర్ఎస్ వైరా నియోజకవర్గ అభ్యర్థి బానోత్ మదన్‌లాల్ పేర్కొన్నారు. ఉద్యమ సారథి, ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే బంగారు తెలంగాణ సాధ్యమని స్పష్టం చేశారు. ఆయన సారథ్యంలోని బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మరోసారి గెలిపిస్తే వైరా నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని అన్నారు. జూలూరుపాడు మండలంలో బుధవారం పర్యటించిన ఆయన.. బేతాళపాడు, పంతులు తండా, టాక్యాతండా, పీక్లాతండా, చీపురుగూడెం, రేగళ్లతండా గ్రామాల్లో రాత్రి 8 గంటల వరకు విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాల పర్యటనకు వెళ్లిన మదన్‌లాల్‌కు ఆయా గ్రామాల మహిళలు హారతులు ఇచ్చి, నుదుటున కుంకుమ దిద్ది ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మదన్‌లాల్ మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు మారుమూల గ్రామాల్లోని ప్రజలకూ అందజేశానని అన్నారు. ఇప్పుడు మరోమారు తనను ఆశీర్వదించి గెలిపిస్తే నియోజకవర్గాన్ని అదే మారుమూల గ్రామాలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, వైరాను రాష్ట్రంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దామని అన్నారు. పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. మరోసారి అధికారంలోకి వచ్చిన వెంటనే బీఆర్ఎస్ నూతన మ్యానిఫెస్టోను అమలు చేస్తామని అన్నారు. అందుకని ప్రజలందరూ బీఆర్ఎస్ ప్రభుత్వం ఇప్పటికే చేసిన అభివృద్ధిని గమనించి కారు గుర్తు ఓటు వేయాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



ప్రచారంలో భాగంగా ప్రజలకు అభివాదం చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి మదన్‌లాల్

# మళ్లీ గెలిస్తే మరింత అభివృద్ధి

- దుర్భరంగా ఉన్న ఖమ్మాన్ని ఇప్పటికే సుందరంగా తీర్చిదిద్దా..
- మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వమొస్తే రూ.30 వేల కోట్లు తెస్తా..
- వన్‌టౌన్ చాలా ముఖ్యమైంది.. అందుకే దీన్ని ముస్తాబు చేశా..
- డివిజన్ల పర్యటన, రోడ్‌షోల్లో బీఆర్ఎస్ అభ్యర్థి అజయ్‌కుమార్

ఖమ్మం, నవంబర్ 22: ఖమ్మం నియోజకవర్గాన్ని తాను అన్ని విధాలా అభివృద్ధి చేశానని, తనను మరోసారి గెలిస్తే మరింతగా తీర్చిదిద్దుతానని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, బీఆర్ఎస్ ఖమ్మం నియోజకవర్గ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. తాను ఇంతలా శ్రమించి ఖమ్మానికి కొత్త రూపు తెస్తే.. ఇప్పుడు మరొకరొచ్చి ఇదంతా తానే చేశానని నిస్సిగ్గుగా చెప్పుకుంటున్నారని విమర్శించారు. ఖమ్మం నగరంలో బుధవారం పర్యటించిన ఆయన.. 23, 39, 41, 58 డివిజన్లలో రోడ్‌షోలు నిర్వహించారు. ముందుగా 41వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ కర్నాటి కృష్ణ ఆధ్వర్యంలో మహిళలు మంత్రి పువ్వాడకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి అజయ్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ సహకారంతో ఖమ్మం అభివృద్ధికి రూ.3 వేల కోట్లు తెచ్చానని గుర్తుచేశారు. ఇప్పుడు మరోసారి బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే రూ.30 వేల కోట్లు తెచ్చి నగరాన్ని మరింత అద్భుతంగా తీర్చిదిద్ది బెస్ట్ సిటీగా చేస్తానని అన్నారు. ఖమ్మానికి మహర్దశ పడుతుందని ఇంతకుమునుపు ఎవ్వరూ ఊహించలేదని అన్నారు. కానీ తాను మాత్రం నిరంతరం శ్రమించి ఖమ్మానికి సరికొత్త రూపాన్ని తెచ్చానని వివరించారు. నిత్యం ట్రాఫిక్ జామ్‌లు అయ్యే నగరాన్ని ఇప్పుడు ట్రాఫిక్ ఫ్రీగా తీర్చిదిద్దానని అన్నారు. ఒకప్పుడు దుర్భరంగా ఉన్న ఖమ్మాన్ని ఇప్పటికే సుందర నగరంగా మార్చానని గుర్తుచేశారు. మన ముస్తాఫానగర్ జంక్షన్ని ముస్తాబు చేశానన్నారు. ధంసలాపురం ఫ్లై ఓవర్ బ్రిడ్జి, డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ వంటి వాటితో నేడు ఈ ప్రాంతం ధగధగ మెరిసేలా చేశానన్నారు. నగరంలో 75 వేల నల్లా కనెక్షన్లతో ఇంటింటికీ శుద్ధజలాలు అందిస్తున్నామన్నారు. వన్‌టౌన్ ప్రాంతమంటే తనకు గుండె కాయ లాంటిదని, ఎంతో ముఖ్యమైనదని అన్నారు. అందుకే దీన్ని మరింతగా ముస్తాబు చేశానని అన్నారు. అందుకని కారు గుర్తుకు ఓటు వేసి తనకు అత్యధిక మెజార్టీ అందించాలని కోరారు. అప్పట్లో ఓడిన తుమ్మల నాగేశ్వరరావుకు సీఎం కేసీఆర్ పిలిచి మంత్రి పదవిని ఇచ్చారని, అయితే కేసీఆర్‌నే తుమ్మల మోసం చేశారని ఆరోపించారు.



బీఆర్ఎస్ అభ్యర్థి అజయ్‌ని గజమాలతో సన్మానిస్తున్న పార్టీ శ్రేణులు, ప్రజలు



నగరంలో అజయ్ రోడ్‌షో ముందు భాగాన నడుస్తున్న పార్టీ శ్రేణులు, ప్రజలు

# అభివృద్ధిలో అగ్రభాగాన నిలుపుతా..

- సీఎం కేసీఆర్‌తోనే సాగర్ జలాలు, సంక్షేమ పథకాలు సాధ్యం
- నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలిచి సత్తుపల్లి సమగ్రాభివృద్ధి సాధిస్తా..
- పెనుబల్లి ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య

పెనుబల్లి, నవంబర్ 22: సత్తుపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రభాగాన నిలుపుతానని స్థానిక ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య పేర్కొన్నారు. సీఎం కేసీఆర్‌తోనే సంక్షేమ పథకాలు, సాగర్ జలాలు సాధ్యమవుతాయని స్పష్టం చేశారు. 5 నిమిషాలు ఓపికగా ఆలోచించి కారు గుర్తుపై ఓటు వేస్తే ఐదేళ్లూ మీకోసం కష్టపడి పనిచేస్తానని అన్నారు. పెనుబల్లి మండలంలో బుధవారం పర్యటించిన ఆయన.. కొత్త లంకపల్లి, లంకపల్లి, మండాలపాడు, చౌడవరం, ఏరుగట్ల, రామచంద్రపురం, భవన్నపాలెం, పీఎస్ పాలెం, ఉప్పలచెరక, లింగగూడెం గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఆయనకు కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. మహిళలు కోలాట నృత్యాలు చేస్తూ, హరతులు పడుతూ ఎదురొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అప్పట్లో టీడీపీ జెండాను చివరి వరకు మోసింది తానేనని అన్నారు. ఆ పార్టీలోనూ, ఈ పార్టీలోనూ మంత్రి పదవులు అనుభవించి వారు ఇప్పుడు తన పైనా, బీఆర్ఎస్ ప్రభుత్వంపైనా బురద జల్లుతున్నారని విమర్శించారు. టీడీపీ ఏమిటో, ఆ పార్టీ జెండా ఏమిటో తెలియని వారు ఇప్పుడు తెలుగుదేశం పార్టీ మద్దతు ఆయనకేనంటూ చెప్పుకుంటూ ప్రచారం చేసుకోవడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. నాలుగోసారి కూడా ఇక్కడి ప్రజలను గెలిపించడం ద్వారా ఈ ప్రాంతాన్ని తాను మరింత అభివృద్ధి చేస్తానని అన్నారు. అనంతరం మండలంలోని చౌడవరంలో కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు చెలికాని రాజబాబు.. సండ్రకు మద్దతు ప్రకటించడంతో ఎమ్మెల్యే ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు లక్కినేని అలేఖ్య, చెక్కిలాల మోహన్‌రావు, కనగాల వెంకట్రావు, చెక్కిలాల లక్ష్మణరావు, లక్కినేని వినీల్, భూక్యా ప్రసాద్, మందడపు అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పెనుబల్లిలో ఎమ్మెల్యే సండ్ర ప్రసంగాన్ని ఆసక్తిగా వింటున్న ప్రజలు, శ్రేణులు

# మాయమాటలకు 'పాలేరు'లో చోటులేదు

- ప్రజల గుండెల్లో బీఆర్ఎస్ స్థానాన్ని ఎవరూ తొలగించలేరు
- మరోసారి బీఆర్ఎస్‌ను గెలిపిస్తే మరిన్ని సంక్షేమ పథకాలు
- ఖమ్మం రూరల్ పర్యటనలో బీఆర్ఎస్ అభ్యర్థి కందాళ

ఖమ్మం రూరల్, నవంబర్ 22: బయటి వ్యక్తులకు, మాయమాటలకు పాలేరు నియోజకవర్గంలో చోటులేదని స్థానిక ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. పాలేరు ప్రజలెప్పుడూ మంచి చేసే వాళ్ల వైపే ఉంటారని అన్నారు. ఇక్కడి ప్రజలతో తనకు పెనవేసుకున్న అనుబంధం ఉందని, వారి గుండెల్లో తన స్థానం సుస్థిరమని అన్నారు. ఖమ్మం రూరల్ మండలంలో బుధవారం పర్యటించిన ఆయన.. కేఎంసీ 1వ డివిజన్, కరుణగిరి ఏరియా, రాజీవ్ స్వగృహ కాలనీల్లో రోడ్‌షో నిర్వహించారు. ఈ ఎమ్మెల్యేకు స్థానికులు, మహిళలు ఎదరొచ్చి మంగళ హారుతుల పట్టి, పూలవర్షం కురిపించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కార్నర్ మీటింగ్‌లలో కందాళ మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అంటేనే ప్రజల ప్రభుత్వమని అన్నారు. గడిచిన పదేళ్లలో అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం అనేక పథకాలు అమలుచేసిందని గుర్తుచేశారు. మరోసారి గెలిపిస్తే మరిన్ని సంక్షేమ ఫలాలు అందిస్తుందని అన్నారు. నూతన మ్యానిఫెస్టోలో చెప్పిన అనేక కొత్త పథకాలను ప్రజల ముంగిటకు తెస్తుందని వివరించారు. ఇన్నేళ్లలో ఏనాడూ ఇక్కడ కన్పించని నాయకులు కొందరు ఇప్పుడు ఇక్కడికి వచ్చారని, తామే గెలుస్తామని ప్రగల్భాలు పలుకుతున్నారని అన్నారు. మంచి చేసిన వాళ్లను ఓడిస్తామని అంటున్నారని అన్నారు. పాలేరు ప్రజలు మాయామశ్చీంద్రల మాటలకు మోసపోయే వాళ్లు కాదని స్పష్టం చేశారు. అహంకారంతో మాట్లాడే వారికి ఇక్కడ చోటు లేదని అన్నారు. కారు గుర్తు అంటే కర్షకుల గుండె చప్పుడని, దానిని ఎవరూ తొలగించలేరని స్పష్టం చేశారు. పది రోజుల షో తరువాత మాయామశ్చీంద్రల నిజస్వరూపం బయటపడుతుందని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు బానోత్ చంద్రావతి, బెల్లం వేణుగోపాల్, అక్కినపల్లి వెంకన్న, కొండం కళమ్మ, మరికంటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ అభ్యర్థి కందాళను గజమాలతో సన్మానిస్తున్న శ్రేణులు